క్లుప్తంగా

పైప్‌లైన్ పనుల ప్రారంభం



రామయ్యగూడెం రోడ్డులో పైప్‌లైన్ నిర్మాణం

ఆకివీడు: మండలంలోని చినకాపవరం శివారు రామయ్యగూడెం వెళ్లే రోడ్డులోని పట్టా భూములలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు మంచినీటి వసతి కల్పించేందుకు చినకాపవరం సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మీ చర్యలు చేపట్టారు. చినకాపవరం పైప్‌లైన్ నుంచి అరకిలోమీటరు మేర పైప్‌లైన్ నిర్మాణ పనుల్ని ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ ఆదిలక్ష్మీ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలకు అప్పటినుంచి మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. పైప్‌లైన్ నిర్మాణ పనుల్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు నాతిరెడ్డి అన్నవరం పరిశీలించారు.

మహిళల అభ్యున్నతికి ఫాతిమా షేక్ కృషి



భీమవరంలో ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతికి ఫాతిమాషేక్ కృషి చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా సోమవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక కట్టుబాట్లు, అణచివేతను మహిళలు అధిగమించేలా ఫాతిమా షేక్ ఉద్యమించారన్నారు. తొలుత ఫాతిమా షేక్ చిత్రపటానికి పార్టీ నాయకురాలు పుష్పకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, నాయకులు ఎం.సీతారాం ప్రసాద్, యేలేటి విజయానంద్, ఆకలి రాము, నీలాపు భవానీ, కొండల సాయమ్మ, బంగారు జ్యోతి, నీలాపు అప్పాయమ్మ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



చెరుకువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కే గంగాధరరావు హెచ్చరించారు. సోమవారం చెరుకువాడలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, సచివాలయ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పందేలు, జూదం నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ పెద్దలు గ్రామంలో సంప్రదాయ ప్రకారం ముగ్గుల పోటీలు,మ్యూజికల్ చైర్స్,క్రీడాపోటీలు వంటివి నిర్వహిస్తే అటువంటివి పండుగ శోభను ప్రతిబింబిస్తాయన్నారు. ఉపసర్పంచ్ నడింపల్లి వెంకట్రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి కే గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్.చిన్నారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల బహూకరణ

ఆకివీడు: పదో తరగతిలో ప్రథమ స్థానం పొందిన 40 మంది విద్యార్థులకు బైరాజు ఫౌండేషన్ ద్వారా ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ఆసంస్థ ఆకోర్డినేటర్ పెనుమాక భానుమూర్తి చెప్పారు. సిద్ధాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదోతరగతి స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థిని పొన్నాడ యశస్వినికి సోమవారం ట్యాబ్‌ను గ్రామ వికాస సమితి అధ్యక్షుడు బీహెచ్. తిమ్మరాజు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి ఎం.రామకృష్ణ, హెచ్.ఎం. ఎం.ఉమా మహేశ్వరం పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం

కాళ్ల: ఏసు మందిరంలో నివసించేవారు ధన్యులని, ప్రతి ఒక్కరి మనసు క్రీస్తును పోలి ఉండాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ తెలిపారు. కాళ్లకూరులో సీబీసీఎంసీ క్రైస్ట్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు సిలువ మందిర ప్రతిష్టారాధన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడిది జాన్సన్ చేతుల మీదుగా ప్రతిష్టారాధన నిర్వహించారు. సంఘ విశ్వాసులు ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించారు. దైవజనులు బీపీఎఫ్ డైరెక్టర్ కె శామ్యూల్ ఏసురత్నం సి ఆర్ లు, పాస్టర్లు దైవ సందేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాదిరాజులచ్చిరాజు వేగేశ్న విజయరామరాజు, గంట ఆనందరావు, నడింపల్లి ప్రదీప్ రాజు,సాదు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వేగేశ్న గోపాలకృష్ణంరాజు, యజ్రా, దావులూరి మోషే, కావ్య పాల్గొన్నారు.

స్వర్ణయుగం దిశగా జగన్ పాలన

- వైఎస్ జగన్ ప్రజాసంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తి
- భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు



భీమవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో స్వర్ణయుగాన్ని తలపించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్ జగన్ రాష్ట్రంలో నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా భీమవరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే జగన్ ముందంజలో ఉన్నారన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి సుమారుగా 3 వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్రచేసి వారి ఇబ్బందులను తొలగించడానికి నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని శ్రీనివాస్ చెప్పారు. ప్రజల అవసరాలు తీర్చడానికి ఎన్నికల్లో ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్న ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. గడిచిన మూడున్నరేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావడానికి చేయూతనిచ్చారన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ బీసీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నా రు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలు పూర్తిగా అండగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కొప్పర్తి సత్యనారాయణ, కందికట్ల ఎడ్వర్డ్, ముల్లి నర్సింహమూర్తి, పేరిచర్ల సత్యనారాయణరాజు, కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, కేతా నాగబాబు, నాగిడి నారాయణస్వామి, తోట భోగయ్య, నామన మహేష్, కోమటి రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, పెచ్చేటి ప్రసాద్, కైలా పాండురంగారావు, బొక్కా గోపి, మల్లుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

98 శాతం హామీల అమలు

కాళ్ల: ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర పూర్తి చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పీవీఎల్ విలేకరులతో మాట్లాడారు. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా రాష్ట్ర ప్రజల కష్టాలను వైఎస్ జగన్ స్వయంగా చూశారన్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3,648 కిలోమీటర్ల మేర సుదీర్ఘ పాదయాత్ర చేశారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అతి తక్కువ కాలంలోనే నెరవేర్చి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కృషి చేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ అమలుతో ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చారన్నారు. విద్యకు పెద్దపీట వేస్తూ నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. పేదలు విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు డబ్బు జమచేస్తున్నారని చెప్పారు. మహిళల పక్షపాతిగా వారికి ఆర్థిక భరోసానిస్తూ కుటుంబంలో గౌరవం పొందేలా వారి ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తూ పేద మహిళలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ లబ్ధికి కృతజ్ఞతగా మద్దతు తెలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఉండి నియోజకవర్గాన్ని గెలిపించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కానుకగా ఇచ్చేందుకు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని కోరారు.

శృంగవృక్షంలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాలకోడేరు: శృంగవృక్షం గ్రామంలో భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, ఉపసర్పంచ్ కె.ఆనందరాజు, ప్రిన్సిపాల్ వి.కమల్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్.నాగేంద్రబాబు, యు.భగత్‌కుమార్, డాక్టర్ యు.సంపతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందనకు రెండు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్ శ్రీకర్ సోమవారం చెప్పారు. స్థానిక స్టార్ ఆఫ్ హోప్ ఆసుపత్రికి వెళ్లే దారిలో ఇరువైపులా ఆక్రమణలుండటంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదు అందిందన్నారు. కుప్పనపూడి గ్రామంలో 8 ఏళ్ల క్రితం తవ్విన చేపల చెరువును ఆక్వా జోన్‌లో కలపాలని, ప్రస్తుతం నాన్–ఆక్వా జోన్‌లో ఉందని రైతు మెంటే వెంకట సాయి కుమార్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అరుంధతీయుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న అరుంధతీయుల సంఘం నాయకులు

సాక్షి, భీమవరం: అరుంధతీయుల సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తాడేరు గ్రామానికి నూతనంగా ఏర్పడిన అరుంధతి సంక్షేమ సంఘం నాయకులు సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్న పథకాలను అందిస్తున్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలో అరుంధతీయుల సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ప్రభుత్వపరంగా వారికి అన్ని విధాలుగా మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గెద్దాడ సుబ్బారావు, చుట్టుగుల్ల సురేష్ కృష్ణ, కోశాధికారి యార్లగడ్డ రవి, లంక సురేష్, చాటకుర్తి ఏడుకొండలు, అయినవిల్లి పల్లయ్య, యార్లగడ్డ చిన్న, శ్రీను, వినోద్ కుమార్, ములగయ్య, బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు రూ.1.67 లక్షల విరాళం



రెడ్ క్రాస్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): రెడ్‌క్రాస్ సహాయనిధికి ఉపాధి హామీ పథకం భీమవరం క్లస్టర్ ఉద్యోగుల తరపున రూ.లక్ష విరాళం అందించినట్లు డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు సోమవారం చెప్పారు. ఈ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి మండలాల వారీగా అందిన విరాళాలను ఆయన వెల్లడించారు. కాళ్ల రూ.20,100, భీమవరం 14,200, ఆకివీడు 12,450, నరసాపురం 10,650, మొగల్తూరు 8,900, పాలకోడేరు 8,250, యలమంచిలి 8,050, ఉండి 7,450, వీరవాసరం 6వేలు, పాలకొల్లు 1,800, భీమవరం క్లస్టర్ ఆఫీస్ 2,150 వెరసి రూ.లక్ష మొత్తాన్ని భీమవరం క్లస్టర్ ఏపీడీ వి.విజయలక్ష్మి ఈసీకే శ్రీనివాస్, జేఈ ఆనంద్, వివిధ మండలాల టీఏలు, సీఓలు డ్వామా సిబ్బంది పీడీకి అందజేశారు. తణుకు క్లస్టర్ మండలాల సిబ్బంది అందజేసిన రూ:67 వేలతో కలిపి మొత్తం రూ:1.67 లక్షలను జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని రాజేశ్వరరావు తెలిపారు.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభించిన అంబటి రమేష్, ఎస్సై కే.రాజారెడ్డి

ఆకివీడు: ఆకివీడులో 40 ఏళ్లుగా సంక్రాంతి యువజనోత్సవాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ అన్నారు. డీవైఎఫ్ఐ సంక్రాంతి క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం ఉండి, భీమవరం, కైకలూరు నియోజకవర్గాల స్థాయి క్రికెట్ పోటీలను రమేష్‌తో పాటు ఎస్సై కే.రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో రమేష్ మాట్లాడుతూ పండుగ రోజుల్లో యువత జూద క్రీడల వైపు మళ్లకుండా నిర్వహిస్తున్న ఇటువంటి క్రీడలను ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. ఎస్సై రాజారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం సాధించి ప్రభుత్వ రంగ సంస్థలలో క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశాలున్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కే.సుజాత మాట్లాడుతూ ఇటువంటి క్రీడల ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. డీవైఎఫ్ఐ ప్రతినిధులు డోకల రవి తేజ, బీ.రాంబాబు, సబ్బానీ, సందక సూరిబాబు, బొక్కా వర్మ, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి తాడినాడ బాబు, జిల్లా కార్యదర్శి గేదల ధనుష్ పాల్గొన్నారు.


బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి జేఎన్వీ.గోపాలన్

ఆకివీడు: కేంద్రంలోని బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ పిలుపునిచ్చారు. స్థానికంగా సోమవారం జరిగిన ప్రజా సంఘాల అధ్యయన వేదిక (స్టడీ సర్కిల్) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్ని మతోన్మాదంతో రెచ్చగొట్టి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాల్ని కాలరాచి, 44 కార్మిక చట్టాల్ని 4 కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కుల్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నీతిమాలిన పాలనకు ప్రజలు స్వస్తి చెప్పి, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంఘ మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు అధ్యక్షత వహించగా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదల ధనుష్, పట్టణ కార్యదర్శి ఎస్.ఉదయకుమారి, నక్కాని సత్యనారాయణ, నెల్లి సూరిబాబు, జీ.ఆదినారాయణ, పద్మారావు పాల్గొన్నారు.

జాన్సన్‌కు వైఎస్సార్ సీపీ నేతల అభినందనలు



జాన్సన్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెచ్చిన నాయకుడిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు మేడిద జాన్సన్ నిలిచారని జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల మహంకాళి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సోమవారం భీమవరంలోని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా నియమితులైన జాన్సన్ ఇంటికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సూరవరపు వెంకటాచార్యులు వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్ రాష్ట్ర నాయకుడిగా ఉన్న జాన్సన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గుర్తించి ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆయన సేవలు వైఎస్సార్‌సీపీకి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యమంత్రి అప్పగించిన బాధ్యతను మరింత సమర్థంగా నిర్వహించేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులంతా సంసిద్ధంగా ఉన్నారన్నారు. జాన్సన్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు దాట్ల శ్రీనివాసరాజు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకోండి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో బి.వినాయకుడు

భీమవరం అర్బన్: బడి బయట పిల్లలు లేకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బి.వినాయకుడు సూచించారు. భీమవరంలోని మండలపరిషత్ కార్యాలయంలో అర్బన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక, ఆవాస ప్రాంత విద్యా ప్రణాళిక తయారీపై సోమ వారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎల్‌కేజీనుంచి పదో తరగతివరకు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, నాడు–నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలల అభివృద్ధి, ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు ఇలా విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక్క రూపాయి భారం కాకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. బడికి రాకుండా బయటఉన్న పిల్లలను ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పాఠశాలలకు వచ్చేటట్లు చూడాలన్నారు. అలాగే 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల డేటా ఆధారంగా పుస్తకాల ప్రింటింగ్, విద్యా కానుక కిట్ల అందించేందుకు వివరాలు ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకశ్రద్ధ తీసుకోవా లని సూచించారు. ప్రధానోపాధ్యాయులు భగవాన్ రాజు, రాఘవ ప్రసా ద్, జాన్‌బాబు, రంగవల్లి, బి. వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు ఎస్ నాగార్జున, రమణ, విజయకుమారి పాల్గొన్నారు.

రెవెన్యూ క్యాలెండర్ ఆవిష్కరణ

కాళ్ల: ఏపీ రెవెన్యూ శాఖ ఉద్యోగుల క్యాలెండర్‌ను తహసీల్దార్ టీఏ కృష్ణారావు సోమవారం ఆవిష్కరించారు. భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడి, ఆర్ఐ కె.రాఘవమూర్తిరాజు, సీనియర్‌అసిస్టెంట్ వై.నాగమణి, వీఆర్వోలు శివనాగరాజు, సీతారాం, సాయి పలువురు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సారా కేసులో సీజ్ చేసిన రెండు మోటార్ సైకిళ్లను ఈనెల 12న వేలం వేస్తామని టూటౌన్ సీఐ బి.కృష్ణకుమార్ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామని తెలిపారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం పరుగులు

వీరవాసరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరి ఓంకారం అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర పూర్తయి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నవుడూరు జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలతోపాటు, ఇవ్వని హామీలను నెరవేర్చిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని కీర్తించారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌లకు అండగా నిలవాలని కోరారు. భారీ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీశెట్టి లక్ష్మి, నల్లమిల్లి వేణుక, మానుకొండ ప్రదీప్‌కుమార్, పోలిశెట్టి సత్యనారాయణ, గొలగాని సత్యనారాయణ, గెడ్డం భాస్కరరావు, నాగరాజు వెంకటశ్రీనివాసరాజు, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, నూకల కనకారావు, కోటిపల్లి బాబు, కోడే అప్పారావు, కోడే వరలక్ష్మి పాల్గొన్నారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. తమ విద్యార్థులు వి.లిఖిత, ఎ.హర్షిణి, ఎం.శ్రీలక్ష్మీ సుభాషిణి విద్య, ఎన్.సౌజన్య, వి.హిమబిందులకు ఉద్యోగాలు లభించాయన్నారు. అనంతరం విద్యార్థినులను శ్రీనివాస్, ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ బి.మావుళ్లు, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్స్ రవీంద్రబాబు, బ్రహ్మం అభినందించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

వీరవాసరం: మన సాంప్రదాయాలను కాపాడుకుంటూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని వీరవాసరం ఎస్ఎంబీటీ ఏవీ అండ్ ఎస్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ (బాబ్జి) తెలిపారు. కళాశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులు, గొబ్బెమ్మలతో కళాశాల ప్రాంగణాన్ని అలంకరించారు. సంప్రదాయ నృత్యాలతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వలవల నర్సింహరావు, జాయింట్ సెక్రటరీ వర్ధినీడి వెంకట రవి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశేష దీపోత్సవం



వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవ దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ధనుర్మాసం పురస్కరించుకుని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి వారికి సోమవారం విశేష దీపోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కోడి కత్తులు స్వాధీనం

వీరవాసరం: కొణితివాడలో ఓ ఇంటిపై దాడి చేసి 264 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగ ప్రసాద్ సోమవారం చెప్పారు. కొణితివాడ గ్రామానికి చెందిన అల్లం సుబ్రహ్మణ్యం అలియాస్ ముత్యాలపల్లి సుబ్రహ్మణ్యం ఇంటిపై దాడులు నిర్వహించి అతని నుంచి కోడి కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్సై పి.రమేష్, సిబ్బంది సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.